క్లుప్తంగా

కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం



కార్యకర్తలతో సమావేశమైన నాయకులు

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని పీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ సభ్యుడు సరికొండ మల్లేష్, ప్రతాప్‌రెడ్డి, పాండు ధీమా వ్యక్తం చేశారు. శనివారం కందుకూరులో కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించేలా అందరూ కలిసికట్టుగా శ్రమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెన్నారెడ్డి, శ్రీశైలం, అంజిరెడ్డి, కె.రాములు, గాండ్ల ప్రశాంత్, రంగారెడ్డి, జైపాల్‌రెడ్డి, జగన్, వెంకటేష్‌గౌడ్, తల్లోజు వినోద్‌చారి, రంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎస్.అంజిరెడ్డి, నర్సింహ, శ్రీశైలం, కుమార్, మహేందర్, నందు, నవీన్, జగదీశ్, పయ్యా, శ్రీను, అనిల్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: మండలంలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి, అమీర్‌పేట్ గ్రామంలో సీతా రాంజనేయస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయాల్లో స్వామివారికి అభిషేకం, హారతి, మంత్రపుష్పం, పుష్పలంకరణతో పాటు తమలపాకులతో అర్చన పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో దంపతులు సత్యనారాయణ వ్రతాలు చేశారు. శనివారం కావడంతో మండలంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, ధర్మకర్తలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస రావు, ఆలయ ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమీర్‌పేట్ అంజనేయ స్వామి అధ్యక్షుడు అంజయ్య ముదిరాజ్, ఆలయం పూజారి తొండుపల్లి సంతోష్ శర్మ, వీరేశం ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు



బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీపీ, బీజేపీ నాయకులు

కందుకూరు:మండల కేంద్రంలో ఎంపీపీ మంద జ్యోతిపాండు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అందంగా పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మల వద్ద మహిళలు ఆడిపాడారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, ఎంపీటీసీ మల్లేష్, జిల్లా నాయకులు జంగారెడ్డి, రమేష్‌గౌడ్, సత్యనారాయణరెడ్డి, సత్తిరెడ్డి, ఎస్.వెంకటేష్, మహేందర్ పాల్గొన్నారు.

శ్రీరాములుకు సన్మానం



శ్రీరాములు యాదవ్‌ను సత్కరిస్తున్న నాయకులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ పాటీదార్ భవన్‌లో శనివారం జరిగిన నవరాత్రి ఉత్సవాల్లో మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డిలు పాల్గొన్నారు. దాండియా నృత్యంలో ఆడిపాడి మార్వాడీలను ఉత్సాహపరిచారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ.. కాలనీల్లో ప్రశాంతంగా దసరా ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. వేడుకలో బీజేపీ నాయకులు ముంత రాములు, సిద్దు ముదిరాజ్, చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, ఆరుట్ల సురేష్, బాణాల ప్రవీణ్, మాధురి వీరకర్ణారెడ్డి, పద్మ ఐలయ్య యాదవ్, మధుసూదన్‌రెడ్డి, కట్టెల శివ పాల్గొన్నారు.

ముగిసిన 'బైబిల్ స్కూల్'

వనస్థలిపురం: దసరా సెలవుల సందర్భంగా వనస్థలిపురం ఎన్జీఓస్ కాలనీలోని సీయోను ప్రార్థన మందిరంలో అక్టోబర్ 16 నుంచి నిర్వహిస్తున్న విరామ బైబిల్ పాఠశాల శనివారంతో ముగిసింది. ఒకేషనల్ బైబిల్ స్కూల్ (వీబీఎస్) లో భాగంగా చిన్నారులకు కథలు, పాటలు, బైబిల్ లోని కంఠత వాక్యాలు, ఇతర కార్యక్రమాలు నేర్పించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. చివరిరోజు ప్రేమ విందు నిర్వహించారు. కార్యక్రమంలో హెబ్రోను దైవ సేవకుడు బ్రదర్ డేవిడ్ పుష్పరాజ్, సంఘ పెద్దలు జెకర్యా, చినరాజు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహాలక్ష్మిగా అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. భక్తులు ఆలయాలు, మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూజారులు హారతి, అభిషేకం, అర్చన, సుప్రభాత సేవ, పంచామృతాషేకం, సహస్ర నామార్చన, హోమం, మంత్ర పుష్పం, గణపతి, నవగ్రహ హోమం, మంత్రపుష్పం ,తీర్థ ప్రసాద వితరణ వంటి పూజలు నిర్వహించారు. తీర్థ, ప్రసాదాలు అందజేసి అమ్మవారి దర్శనం కల్పించారు.

–సాక్షి, నెట్‌వర్క్



తుక్కుగూడ : మంఖాల్‌లో మహాలక్ష్మి రూపంలో అమ్మవారు



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో



మీర్‌పేట: అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న భక్తులు



నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో చండీహోమం చేస్తున్న భక్తులు

కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి



ముఖ్య నాయకుల సమావేశంలో కాంగ్రెస్ నేతలు

- మాజీ ఎంపీపీ, సీనియర్ నాయకుడు కోరుపోలు రఘుమారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఘట్టుపల్లి గ్రామ సమీపంలోని ఓ ఫామ్ హౌస్‌లో మండల కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహేశ్వరం మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రూపులకు చెక్‌పెట్టి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. పార్టీ అధిష్ఠానం మహేశ్వరంలో టికెట్ ఎవరికి ఇచ్చిన వారి గెలుపు కోసం తామంతా పని చేస్తామన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం మండలం నుంచి కాంగ్రెస్ పార్టీకి అధిక్యత ఇచ్చామని ఈ సారి ఎన్నికల్లో మండలం నుంచి అధిక మెజార్టీ ఇవ్వాలని కోరారు. మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఆరు గ్యారంటీ స్కీంలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేసి పార్టీ పట్ల ఆకర్షితులను చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్, పార్టీ సీనియర్ నాయకులు నారాయణ, హరినాథ్ గౌడ్, పాండు నాయక్,నేనావత్ రాజునాయక్, అంగోత్ కృష్ణానాయక్, కుమార్, సత్యనారాయణరెడ్డి, మంత్రి బాల్‌రాజ్, యాదయ్య, మంత్రి బాల్‌రాజ్, దామోదర్‌రావు,సేవ్యానాయక్, శ్రీశైలం, గణేష్ పలువురు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ. 23 లక్షలు స్వాధీనం

హస్తినాపురం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని వనస్థలిపురం పోలీసస్టేషన్ పరిధిలో పోలీసులు శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 23 లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జలంధర్‌రెడ్డి వెల్లడించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్ వాటర్ ట్యాంక్ దగ్గర తనిఖీ చేయగా రూ.3 లక్షలు, వనస్థలిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల దగ్గర తనిఖీలు చేయగా 20 లక్షల రూపాయలు లభించాయన్నారు. స్వాధీనం చేసుకున్న నగదును ఎల్‌బీనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించామని సీఐ చెప్పారు.



స్వాధీనం చేసుకున్న నగదును చూపిస్తున్న సీఐ జలంధర్‌రెడ్డి

చైతన్యపురిలో రూ.16.17 లక్షలు...

చైతన్యపురి: కారులో అనుమతి లేకుండా తరలిస్తున్న రూ.16,17,770 నగదును చైతన్యపురి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం చైతన్యపురి చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో సికింద్రాబాద్ గాంధీనగర్‌కు చెందిన రైటర్ సగా గార్డ్ ప్రైవేటు లిమిటెడ్‌లో పనిచేసే బండారం ప్రదీప్‌కుమార్ (36) ఎటువంటి పత్రాలు లేకుండా రూ. 16,17,770 నగదు తరలిస్తున్నట్లు గుర్తించారు. నగదును సీజ్ చేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమాచారం ఇచ్చారు.

ఎల్‌బీనగర్‌లో రూ. 5 లక్షలు

నాగోలు: ఎల్‌బీ నగర్ పోలీసులు చింతలకుంట వద్ద శనివారం వాహన తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో గూడూరు చంద్రకాంత్‌రెడ్డి అనే వ్యక్తి కారులో ఎలాంటి ప్రతాలు లేకుండా రూ. 5 లక్షల రూపాయలు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు.

నా హయాంలోనే ఎల్బీనగర్ సమగ్రాభివృద్ధి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

హస్తినాపురం: తాను ఎమ్మెల్యేగా పనిచేసిన ఐదేళ్లలో ఎల్‌బీనగర్ సమగ్రాభివృద్ధికి కృషి చేశానని వైఎస్ ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. తన హయాంలోనే సాగర్ రింగ్‌రోడ్డులోని ఫ్లైఓవర్, అండర్‌పాస్‌లు, ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు, కామినేని, నాగోలు ఫ్లైఓవర్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించానని చెప్పారు. ఆర్.కృష్ణయ్య శనివారం హస్తినాపురంలో లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నో కరప్షన్, నో కమీషన్ నినాదంతో అభివృద్ధి పనులు చేశానని, ఎల్‌బీనగర్ ప్రజల గుండెల్లో తన స్థానం పదిలంగా ఉందన్నారు. తన హయాంలో జరిగిన అభివృద్ధి పనులు మును పెన్నడూ జరగలేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు చేశానన్నారు. నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి పెద్దఎత్తున నిధులు కేటాయించానని కృష్ణయ్య తెలిపారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి



ఎస్ఐ హన్మంతరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఐ తదితరులు

ఆమనగల్లు: పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి ఎస్ఐ బాల్‌రాం అన్నారు. ఆమనగల్లు పోలీసు స్టేషన్ ఆవరణలో శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో ఉన్న ఎస్ఐ హన్మంతరెడ్డి విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం పోలీసు అమరవీరుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. ఏఎస్ఐలు యాదయ్య, బాల్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: మంచాల పోలీస్ స్టేషన్‌లో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ శనివారం సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీఐ కాశీ విశ్వనాథ్, ఎస్సైలు రవి నాయక్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 11, వంకాయ 23, బెండ 23, పచ్చిమిర్చి 35, కాకర 20, బీర 18, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్ 75, క్యారెట్ 37, దొండ 13, చిక్కుడు 23–45, గోకర 23, బీట్‌రూట్ 20, క్యాప్సికం 47, ఆలు 21, దోస 11, సొర 11, పొట్ల 13, ఉల్లిగడ్డ 40, చామగడ్డ 37.ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ప్రశాంత్‌నగర్ శ్రీ షిర్డీ సాయి సంస్థాన్ కార్యవర్గం ఎన్నిక

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్‌నగర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా సంస్థాన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, వైస్ చైర్మన్‌లుగా డి.వెంకటేశ్వర్ రావు, ఆర్.వేణుగోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జే.రవీంద్రబాబు, సంయుక్త కార్యదర్శిగా బి.ప్రభాకర్, కోశాధికారిగా ఎం.వి.వెంకటరత్నం, కార్యవర్గ సభ్యులుగా ఆర్.అంజయ్య, పి.రాజేంద్రప్రసాద్, వి.నిర్మలాచౌదరి, వై.సీతారామిరెడ్డి, కే.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. రెండేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుందని చైర్మన్ తెలిపారు.

కార్మికులకు చీరల పంపిణీ

దిల్‌సుఖ్‌నగర్: దసరా పండగ సందర్భంగా వాసవి కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలోని కార్మికులకు రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు మధుర ఉపేందర్‌రెడ్డి శనివారం చీరల పంపిణీ చేశారు. ఈ దసరా పండుగను అందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయంలోని కార్మికులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

కడ్తాల్: అభివృద్ధి, సంక్షేమ పాలన బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు పరమేశ్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో బూత్ కమిటీ కమిటీలను ఎన్నుకున్నారు. కర్కల్‌పహాడ్ గ్రామంలో 165వ బూత్ కమిటీ, గోవిందాయిపల్లి 169, వాస్‌దేవ్‌పూర్ 170, ముద్విన్ గ్రామంలోని 206, 207, 208 బూత్ కమిటీలను పరమేశ్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ సమక్షంలో ఎన్నుకున్నారు. అనంతరం బూత్ కమిటీలకు నియామక పత్రాలు అందజేశారు. పార్టీ నాయకులు క్రమశిక్షణతో పనిచేయాలని, వచ్చే ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ విజయానికి పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, సర్పంచ్ లక్ష్మీనర్సింహ్మారెడ్డి ఉన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి



నాయకులతో సమావేశమైన ఆర్డీఓ తదితరులు

కందుకూరు: ఎన్నికలు సజావుగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డీఓ సూరజ్‌కుమార్ కోరారు. శనివారం కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. 1500 మంది ఓటర్లు దాటిన పోలింగ్ స్టేషన్లను గుర్తించి అదనంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటే చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిందన్నారు. వారి ఆదేశాల మేరకు ఆ సంఖ్య దాటిన పోలింగ్ స్టేషన్లు 31 ఉన్నట్లు గుర్తించామన్నారు. అనంతరం కలెక్టర్‌కు నివేదిక పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ నాయబ్ తహసీల్దార్ శేఖర్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



పూర్తిస్థాయిలో హాజరుకాని సభ్యులు, అధికారులు

- అరకొరగా హాజరైన అధికారులు
- సర్పంచులు ఎంపీటీసీలు గైర్హాజరు

కందుకూరు: ఎన్నికలకు సంబంధించిన సమావేశాల కారణంగా ప్రధాన శాఖల అధికారులు సర్వసభ్య సమావేశానికి గైర్హాజరయ్యారు. శనివారం ఎంపీపీ మంద జ్యోతిపాండు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఉ. 11.20లకు ఆరుగురు సభ్యులతో సమావేశం ప్రారంభించారు. కాసేపటికి మరో సభ్యుడు వచ్చాడు. మొత్తం 16 మంది ఎంపీటీసీలకు గాను 7గురు, 35 మంది సర్పంచులకు కేవలం ముగ్గురు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. ఆయా శాఖల సమీక్ష గంటలో మొక్కుబడిగా మమ అనిపించారు. అటవీశాఖ లేమూర్ డివిజన్ అధికారులు సమావేశాలకు ఎందుకు రారని సభ్యుడు యాదయ్య, ముచ్చర్ల–దెబ్బడగూడ మధ్య రోడ్డు విషయమై మరో సభ్యుడు మల్లేష్ ప్రశ్నించారు. సమస్యలు వెల్లడించినా అధికారులు పరిష్కారం చూపడం లేదని సర్పంచ్ సుమన్ వాపోయాడు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకట్రాములు, ఎంపీటీసీలు ఎస్.రాజశేఖర్ రెడ్డి, ఎస్.ఎల్లారెడ్డి, ఎం.యాదయ్య, రాజమ్మ, కాకి రాములు, మల్లేష్, కోఆప్షన్ సభ్యుడు సులేమాన్, సర్పంచులు సుమన్, శ్రీనివాస్, వసంతలక్ష్మి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరులకు నివాళి

పహాడీషరీఫ్: ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు రక్షణ కల్పించే వాడే పోలీస్ అని బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్‌రెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం విధి నిర్వహణలో అసువులు బాసిన అమరులకు నివాళులర్పించి.. రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజారక్షణ, శాంతిని నెలకొల్పేందుకు పోలీసులు విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయాల్సి ఉంటుందన్నారు. సమాజం కుటుంబంగా భావించి నిద్రాహారాలు మాని రక్షణగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు సైదులు, యూసుఫ్ జానీ, మహేందర్, మసియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది

కౌలు రైతులపై సర్కార్ కుట్ర

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి

యాచారం: ఓంకారేశ్వరాలయ భూములను సర్కార్ కాజేయాలని చూస్తోందని, అందుకే కౌలు రైతులకు హక్కులు కల్పించకుండా కుట్ర చేస్తోందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి పేర్కొన్నారు. నందివనపర్తి గ్రామంలోని ఓంకారేశ్వరాలయ భూములను శనివారం సీపీఎం, రైతు సంఘం బృందం ప్రతినిధులు పరిశీలించారు. తాడిపర్తి, నస్దిక్‌సింగారం, కుర్మిద్ద గ్రామాల్లో ఉన్న ఆలయ భూములను వారు సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ వందేళ్లకు పైగా 400 కుటుంబాలకు చెందిన రైతులు ఓంకారేశ్వరాలయ భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. కౌలు రక్షిత చట్టం ప్రకారం రైతులకు సర్టిఫికెట్లు ఉన్నాయని పేర్కొన్నారు. కౌలు రైతులకు అన్యాయం చేయాలని చూసినా, లాక్కోవాలని కుట్రలు చేసినా సీపీఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ సర్కార్ ఓంకారేశ్వరాలయ భూములను టీఎస్ఐఐసీ ద్వారా సేకరించి ఫార్మాసిటీకి ఇవ్వాలని చూస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సీపీఎం యాచారం మండల కార్యదర్శి నర్సింహ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, నాయకులు మల్లేశ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జంగారెడ్డి తదితరులు

'పట్నం' గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తాం



బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: పట్నం గడ్డపై మరో మారు గులాబీ జెండా ఎగరవేస్తామని ఎంపీపీ కృపేష్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఇబ్రహీంపట్నం మండలంలోని నాగన్‌పల్లి, పోల్కంపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృపేష్ మాట్లాడుతూ 15 ఏళ్లుగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నాయకత్వంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. ప్రత్యేక చొరవతో ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయలు నిధులు తీసుకొచ్చి మౌలిక సదుపాయలు కల్పించారని తెలిపారు. ఇప్పటికే మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మంచిరెడ్డి.. ఈ సారి గెలిస్తే హ్యాట్రిక్ ఎమ్మెల్యే అవుతారన్నారు. ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు..ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బుగ్గరాములు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నాయకులు రవీందర్, దానయ్య, గిరి, కృష్ణ, బాలయ్య, చందు తదిరులు పాల్గొన్నారు.

మంచిరెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరు

ఇబ్రహీంపట్నం: ఎన్ని డ్రామాలాడిన ఇబ్రహీంపట్నం నుంచి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరని స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ధీమావ్యక్తం చేశారు. శనివారం ఇబ్రహీంపట్నంలో మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని జోస్యం చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి కిషన్‌రెడ్డి చేసిన పనులే శ్రీరామరక్షగా నిలుస్తాయన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి